మెట్ట భూముల్లో.. సిరుల పంటలు



కూరగాయలు సాగుకు సిద్ధం చేస్తున్న నారు

- లాభదాయకంగా **కాలీఫ్లవర్,** మిర్చి పంటలు
- ఎకరాలో కాలీఫ్లవ**ర్ సాగుకు** రూ.లక్షకు పైగా **ఆదాయం**
- రూ.1.50 లక్షల **ఆదాయం తెస్తున్న** మిర్చి పంట
- పంట చేనులోనే విక్రయాలు



విక్రయానికి సిద్ధంగా ఉన్న కాలీఫ్లవర్



మిర్చిలో అంతర పంటగా కాలీఫ్లవర్



బోర్లు నుంచి పుష్కలంగా ప్రవహిస్తున్న నీరు

నాతవరం: కాలీఫ్లవర్, మిర్చి సాగు రైతులకు లాభదాయకంగా మారింది. ఇతర పంటల కంటే ఆరుతడి పంటలు ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం ఆర్జిస్తున్నారు. మండలంలో ములగపూడి, ఎం.బెన్నవరం, ఎం.బి.పట్నం, మాధవనగరం, నాయుడుపాలెం గ్రామాల్లో కాలీఫ్లవర్ పంట 25 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఈ పంట ఏడాదికి మూడు సార్లు వేస్తున్నారు. దీని కాల పరిమితి మూడు నెలలు కాగా, ఎకరానికి పెట్టుబడి రూ. 30 వేలు ఖర్చవుతోంది. ఎకరానికి 10 వేల కాలీఫ్లవర్ మొక్కలు వేస్తారు. విత్తనాలు కొనుగోలు చేసి వాటిని నారుపోసి మొక్కలు నాటుతారు. పంట పండాక పొలాల్లోకి వ్యాపారులు వచ్చి రైతులు వద్ద కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. కాలీఫ్లవర్ ఒక్కంటికి పంట సీజన్‌ను బట్టి రూ.20 నుంచి రూ.30 మధ్య విక్రయాలు చేస్తుంటారు.

60 ఎకరాల్లో మిర్చి సాగు...

మండలంలో ములగపూడి, మాధవనగరం, గునుపూడి, శృంగవరం, మన్యపురట్ల, తాండవ, నాతవరం, ఉటమల్ల, తాళ్లపాలెం, ఎ.పి.పురం, ఎం.బి.పట్నం, పి.కె.గూడెం, పెదగొలుగొండపేట గ్రామాల్లో 60 ఎకరాల్లో మిర్చి సాగు చేస్తున్నారు. మిర్చి పంట ఏడాదికి రూ.1.50 లక్షల వరకు ఆదాయం వస్తోంది. అధికంగా కాలీఫ్లవర్ మిర్చి తోటలో అంతర పంటగా సాగు చేస్తుంటారు. కాలీఫ్లవర్, మిర్చి కలిపి సాగు చేయడంతో నీరు వృథా కాకుండా పెట్టుబడి సైతం తక్కువగా అవుతోంది. కాలీఫ్లవర్ ఏడాదికి మూడు సార్లు, మిర్చి పంట రెండు సార్లు సాగు చేస్తుంటారు. వాతావరణ పరిస్థితులు బాగుంటే ఎలాంటి తెగుళ్ల వ్యాపించవు. ఎక్కడైనా పురుగు దోమ వంటి సోకితే తక్కువ మోతాదులో క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తుంటారు. వీటితో కొత్తిమీర, వంగ, బెండ, తోటకూర, టమాటా, చిక్కుడు వంటి కూరగాయల పంటలు ఈ ప్రాంతంలో సాగు చేస్తున్నారు. జీడి, మామిడి తోటల పంటలతో పోల్చుకుంటే తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వస్తుందని సాగు రైతులు చెబుతున్నారు. మండలంలో ఎగువ ప్రాంతంలో తాండవ ప్రాజెక్టు ఉండటంతో వ్యవసాయ బోర్లు నుంచి నీరు పుష్కలంగా రావడంతో అన్ని విధాలుగా బాగుంటుంది.

ఆదాయం బాగుంది



ఇతర వ్యవసాయ పంటలతో పోల్చుకుంటే కాలీఫ్లవర్, మిర్చి సాగుకు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వస్తోంది. వరి సాగు చేస్తే ఏవిధంగా గిట్టుబాటు కావడం లేదు. అందుకే వ్యవసాయ బోరు నీరు ఆధారంగా కాలీఫ్లవర్, మిర్చి సాగు చేస్తున్నారు. కాలీఫ్లవర్ ఏడాదికి ఎకరానికి రూ.లక్ష, మిర్చి రూ.1.50 లక్షలు వస్తోంది.

పైల కృష్ణబాబు, రైతు

క్లుప్తంగా

ఎం. కోడూరు మోదమాంబకు వెండి విరాళం



వెండిని అందజేస్తున్న దాతలు పాతాళం కుటుంబీకులు

మాడుగుల రూరల్: ఎం. కోడూరులో మోదమాంబ అమ్మవారికి దాతలు ఆదివారం పావు కిలో వెండి విరాళంగా అందజేశారు. పాతాళం వెంకటరమణ జ్ఞాపకార్థంగా అతని భార్య వరహాలమ్మ, కుమారుడు కొండాజీ, దుర్గా లావణ్య దంపతులు గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకు అందజేశారు. ఎంపీటీసీ సభ్యులు ముమ్మిన రమణబాబు, నాయకులు పడాల అప్పలనాయుడు, గెంజి రాజేష్ కుమార్, రాయపురెడ్డి కొండబాబు, పి. జగదీష్ పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



కేసులు నమోదు చేస్తున్న ఎస్ఐ శ్రీనివాస్

రావికమతం: పి.పొన్నవోలు వద్ద ఆదివారం పోలీసులు ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేశారు. హెల్మెట్, లైసెన్స్, ఇన్సూరెన్స్ లేని వాహన చోదకులను గుర్తించి కేసులు నమోదు చేశామని కొత్తకోట ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. వీటిపై వారికి అవగాహన కల్పించారు.

వృద్ధురాలి ఆచూకీ లభ్యం



వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

పెందుర్తి: సుజాతనగర్‌లో అదృశ్యమైన వృద్ధురాలి కేసును పెందుర్తి పోలీసులు గంటల్లోనే ఛేదించారు. చోడవరం మండలం చిన గోవాడకు చెందిన వృద్ధురాలు(80) సుజాతనగర్‌లోని మనవడి ఇంటికి ఆదివారం ఉదయం వచ్చింది. మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె, సాయంత్రమైనా తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. తక్షణమే రంగంలోకి దిగిన పోలీసులు చినముషిడివాడ ప్రాంతంలో ఆమెను గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

12న రామాలయ ప్రారంభోత్సవం



గోడపత్రిక విడుదల చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

చీడికాడ: తునివలసలో ఈ నెల 12న నూతన రామాలయం ప్రారంభోత్సవంతో పాటు విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ మేరకు ప్రతిష్ఠకు సంబంధించిన గోడపత్రికను విడుదల చేశారు. సీతారామాంజనేయ, లక్ష్మీదేవి, వినాయక విగ్రహాలు ప్రతిష్ఠ ఉంటుందన్నారు. సోమవారం నుంచి అంకురార్పణ పూజలతో ప్రతిష్ఠ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు.

రెండు గ్రామాల్లో నవోదయం 2.0



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ ప్రసాద్

మాడుగుల: మండలంలో గొప్పులుపాలెం, కొండలపాడు గ్రామాల్లో నవోదయ 2.0 అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ సీహెచ్‌వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ సారా తయారు చేసినా, అమ్మినా ప్రొహిబిషన్ చట్టం ప్రకారం కఠిన చర్యలు ఉంటాయన్నారు. సారా సంబంధిత ఫిర్యాదులు 14401 టోల్ ఫ్రీ నంబరుకు చేయాలన్నారు. కార్యక్రమంలో గిరిజన గ్రామాలు ప్రజలు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

12న వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

దేవరాపల్లి: బోయిలకింతాడలో ఈ నెల 12న వైఎ**స్సార్‌సీపీ ఆవిర్భావ ది**నోత్సవం ఘనంగా నిర్వ**హించనున్నట్లు పార్టీ** మండలాధ్యక్షుడు బూరె **బాబూరావు తెలిపారు.** ఈ వేడుకల్లో మాజీ **డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌**సీపీ జిల్లా అధ్యక్షుడు **బూడి ముత్యాలనాయు**డు ముఖ్య అతిథిగా **పాల్గొంటారన్నారు. ఇక్క**డ మహానేత వైఎస్సార్ **విగ్రహానికి నివాళులర్పిం**చి, పార్టీ జెండాను ఆవి**ష్కరిస్తారన్నారు. ఈ కార్య**క్రమానికి మండలంలోని **అన్ని గ్రామాల సర్పంచ్**లు, ఎంపీటీసీలు, పార్టీ **శ్రేణులు తరలిరావాలని** కోరారు.

ముత్యాలమ్మ ఆలయానికి ఫ్యాన్ వితరణ



వాల్ ఫ్యాన్ అందజేస్తున్న దాత రమణ

రోలుగుంట: మండలంలో కొంతలం పంచాయతీ శివారు పాపంపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ ఆలయానికి బుచ్చింపేటకు చెందిన అనిమిరెడ్డి రమణ వాల్ ఫ్యాన్‌ను వితరణగా అందించారు. విశాఖలో వార్డు కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయనకు కమిటీ వారు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలు స్వయం ఉపాధితో ఎదగాలి



వాసవీక్లబ్ జోన్ చైర్మన్ పుట్టా మాధవిని సన్మానిస్తున్న వాసవీ క్లబ్ మహిళలు

మాడుగుల రూరల్: మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని వాసవీ క్లబ్ జోన్ చైర్మన్ పుట్టా మాధవి అన్నారు. జంపెన వాసవీమాత ఆలయం వద్ద కింతలి–గాదిరాయి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు అనపగడ్డ అనిత, కె. లక్ష్మి, పి. రూప, కె. అశ్వినిలను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ వృత్తి, ఉపాధితో పాటు వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి అర్జునరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చీడికాడ జోన్ చైర్మన్ శ్రీనాథు అప్పారావు, వాసవీ క్లబ్ జిల్లా అధికారులు శ్రీనాథు కన్నయ్యశెట్టి, అనపగడ్డ హరినాథబాబా, నాచు గున్నయ్యశెట్టి, క్లబ్ ప్రతినిధులు రావాల సతీష్, పుట్టా ప్రకాష్, పుట్టా కొండలరావు పాల్గొనానరు.

క్రీడాకారులకు సహకారమందిస్తాం



ఎంపికైన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు

నర్సీపట్నం: నింజాస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్టీఆర్ స్టేడియంలో వుషూ, బాక్సింగ్, తైక్వాండో, కిక్ బాక్సింగ్ క్రీడలకు సంబంధించి కోచెస్, రిఫరీ జడ్జింగ్ సెమినార్‌ను నియోజకవర్గ స్థాయిలో నిర్వహించారు. క్రీడాకారులు తోట ప్రసాద్, మునికోటి విజయ్, బి.రాజేశ్వరి, ఎస్.అర్జున్‌రెడ్డి, ప్రియాంక, మౌనిక పాల్గొన్నారు. వీరికి నింజాస్ అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు స్పోర్ట్స్ టీ షర్ట్‌లు, భోజన వసతి కల్పించారు. క్రీడాకారులకు ఎప్పుడు తన సహాయ సహకారాలు ఉంటాయన్నారు. బాగా ఆడి నర్సీపట్నంకు పేరు తీసుకురావాలన్నారు. వీరికి శాప్ కోచ్ కె.అబ్బు సెమినార్‌లో గేమ్స్, విధి విధానాలు, న్యూట్రిషన్‌పై శిక్షణ ఇచ్చారు. స్టూడెంట్స్‌కు వుషూ, బాక్సింగ్, కరాటేలో సెలెక్షన్ నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశారు. తదుపరి సెమినార్ జిల్లా స్థాయిలో జరుగుతుందని సీనియర్ కోచ్ యర్రా శేఖర్ తెలిపారు.

వైభవంగా మోదకొండమ్మ పండగ



హుషారుగా దౌడు తీస్తున్న ఎడ్లు

బుచ్చెయ్యపేట: విజయరామరాజుపేటలో మోదకొండమ్మ పండగను గ్రామస్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. కుటుంబ సభ్యులంతా గ్రామ పొలిమేరలో ఉన్న అమ్మవారి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయింత్రం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పరుగు పందెం ఆకట్టుకుంది. విజేతలకు నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు బహుమతులు ప్రదానం చేశారు. రాత్రికి భారీ మందుగుండు సామగ్రి కాల్పులు, డప్పులు, వాయిద్యాల నడుమ అమ్మవారి సంబరం సాగింది. మంగళాపురం, కుముదాంపేట, సురవరం, వడ్డాది తదితర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది.

సరుగుడు జలపాతం వద్ద సండే సందడి



సరుగుడు జలపాతం

నాతవరం: సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులతో సందడిగా మారింది. ఇక్కడ ఎత్తయిన రెండు కొండల మధ్యలోంచి జాలువారే నీటిలో జలకాలాట ఆడుతూ సేద తీరారు. ఉమ్మడి విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల నలుమూలలు నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు రావడంతో ఈ ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ద్విచక్ర వాహనాలు, కార్లు అధిక సంఖ్యలో రావడంతో సరుగుడు మార్గంలో రద్దీ నెలకొంది.

ప్రారంభోత్సవానికి సిద్ధంగా మరిడిమాంబ ఆలయం



మరిడిమాంబ ఆలయం

కె.కోటపాడు: మండలంలో ఆర్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన మరిడిమాంబ అమ్మవారి ఆలయం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఇక్కడ అమ్మవారి ఆలయం జీర్ణావస్థ దశకు చేరుకోవడంతో నూతన ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు సంకల్పించారు. రూ.30 లక్షలతో ఆలయ నిర్మించి సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. మరో నెల రోజుల్లో ఆలయ ప్రారంభోత్సవంతో పాటు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనా కార్యక్రమాలను నిర్వహించేందుకు గ్రామ పెద్దలు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏపీ సీఆర్పీ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా 'సబ్బవరపు'

అనకాపల్లి టౌన్: ఏపీ సీఆర్పీ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా సబ్బవరపు శంకరరావు ఎన్నికయ్యారు. స్థానిక కృష్ణవేణి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో రాష్ట్ర క్లస్టర్ రీసోర్స్ పర్సన్ గౌరవ అధ్యక్షుడు గిరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సీఆర్పీ సర్వసభ్య సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికైంది. మండలం గౌరవ అధ్యక్షుడిగా శ్యామ్, అధ్యక్షుడిగా ఎస్. శంకరరావు, జనరల్ సెక్రటరీగా చిరంజీవి, కోశాధికారిగా మూర్తి, ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ, కన్వీనర్‌గా రమణను ఎన్నుకున్నారు.

నేటి నుంచి లక్ష్మీనారాయణ స్వామి కల్యాణోత్సవాలు

మాడుగుల రూరల్: మండలంలో ఎం. కోడూరులో పురాతన లక్ష్మీనారాయణ స్వామివారి దేవాలయం 35వ వార్షిక కల్యాణోత్సవాలు సోమవారం నుంచి ఈ నెల 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వారు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొలిరోజు ఏపీ సాధు సంపత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద స్వామిజీ ప్రవచనాలు, ఎంపీ, ఎమ్మెల్యేలు పాల్గొంటారన్నారు. జాజిమొగ్గల వరహామూర్తి, లక్ష్మీల కుమారుడు శ్రీనివాస్, హేమ దంపతులు, చవితిన నర్సింగరావు, వెంకటలక్ష్మి దంపతులతో కల్యాణోత్సవం, అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.


మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

చీడికాడ: మంచాల మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.వెంకటలక్ష్మి తెలిపారు. ఐదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ప్రింట్ కాపీతోపాటు ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెటు, కుల, రేషన్‌కార్డు జిరాక్స్ కాపీలను ఈ నెల 30లోగా పాఠశాలలో అందించాలన్నారు. వచ్చే నెల 20న పాఠశాలలో నిర్వహించే ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన వారికి అవకాశం కల్పిస్తామన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవం నేడు

దేవరాపల్లి: తెనుగుపూడి శారదానది తీరాన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు.

వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం



రోలుగుంట: స్థానిక కొండపై వెలిసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. 150 ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయంలో శనివారం పెండ్లిరాట వేశారు. ఈ ఉత్సవాలను దివంగత ముత్యాల రామస్వామి కుటుంబీకులు నిర్వహిస్తారు. ఐదు రోజులు పాటు కల్యాణోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ వారు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



గురువులతో పూర్వ విద్యార్థులు

మాకవరపాలెం: జి.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005–06లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. తలుపులమ్మ తల్లి ఆలయం వద్ద నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో వారంతా చేరుకోవడంతో వారిలో ఆనందం ఉట్టిపడింది. విద్యార్థి దశలో జ్ఞాపకాలను, పాఠశాల వాతావరణం చూసి మురిసిపోయారు. ఒకరికొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అప్పటి గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వంద మంది పూర్వ విద్యార్థులు పాల్గొని వారి అనుభవాలను పంచుకున్నారు.

ఆకట్టుకున్న గుర్రాల పరుగు పోటీలు



మోదకొండమ్మను దర్శించుకుంటున్న భక్తులు



పరుగులు తీస్తున్న రేస్ గుర్రం

మాడుగుల: మండలంలో ఒమ్మలి చెరుకు తూనిక కేంద్రం వద్ద వెలసిన మోదకొండమ్మ పాదాలు తీర్థం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలలో నిర్వహించిన రేస్ గుర్రాల పరుగు పందేలు విశేషంగా ఆకట్టుకున్నాయి. చుట్టు పక్కల గ్రామాలు నుంచి వచ్చిన ప్రజలు వీటిని ఆసక్తిగా తిలకించారు. అదేవిధంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం నేల వేషాలు, శక్తి వేషాలు ప్రదర్శించారు.

కమనీయంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

పెదనందిపల్లిలో భక్తాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ



పెదనందిపల్లిలో భక్తాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి



మారేపల్లి వేంకటేశ్వర స్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తజనం

దేవరాపల్లి: మారేపల్లి ఉత్తర వాహిని శారదానది తీరాన పాండవుల మెట్టపై వెలసిన శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. మారేపల్లితో పాటు పరిసర గ్రామాల ప్రజలు కల్యాణాన్ని తిలకించి తరించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా పెదనందిపల్లి శివారు కొత్త కల్లాల్లో భక్తాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం జరిగింది. స్వామివారిని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు దర్శించుకుని పూజలు చేశారు. గ్రామస్తులు ఆయన్ను సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. దేవరాపల్లి ఎరుకులవీధిలో నూకాంబిక విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దంపతులు, నాయుకులు పాల్గొన్నారు.

ఘనంగా మోదకొండమ్మ తీర్థం



స్వామివారికి పూజలు చేస్తున్న నూతన దంపతులు

మాడుగుల రూరల్: తాటిపర్తి పంచాయతీ శివారు గరికబంద గ్రామంలో మోదకొండమ్మ తీర్థం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం నుంచి చిడతలు, తప్పెటగుళ్లు, కోలాటం, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా భక్తాంజనేయ స్వామి తీర్థం

రావికమతం: దొండపూడిలో భక్తాంజనేయ స్వామివారి తీర్థ మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. మంగళవారం వరకు జరిగే ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు రాత్రికి కండక్టర్ ఝాన్సీ, రమేష్ మాస్టర్, నెల్లూరు కవిత, బాలు రైడర్స్ వారి డ్యాన్స్ బేబీ డ్యాన్స్, బుర్రకథ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త, మాజీ సర్పంచ్ జి. తాతబాబు, గ్రామ పెద్దలు, యువకులు తెలిపారు.